వాళ్ళు ఇద్దరు
వాకాటి పాండురంగారావు

జ్యోతి - శ్యామల - గులాబి - కస్తూరి. వాళ్ళద్దరూ యిటువంటి వారనుకున్నాడు వాసు. కాని తను చివరకు తెలుసుకున్న దేమిటి ?

"..చెప్పు వాసూ ! నువ్వు చెప్పు ..... నేనూ ఒక మనిషిగా బ్రతకాలని కోరడం ఒక తప్పా ? .... నా జీవితాన్ని నేను దిద్దుకోవా లనుకోవడం ఒక నేరమా .... ?"

అంతకుముందు ఇరవై నిముషాలనుండి హెూరుమని తన బాధను వెళ్లబోసుకున్న జ్యోతి హఠాత్తుగా వూరుకుంది. జలపాతం నిలిచిపోయినట్లనిపించింది వాసుకు. తొమ్మిదేళ్ల క్రింద—ఒకచేత్తో ముక్కు తుడుచుకుంటూ, మరొకచేత్తో పరికిణి అంచును మెలిపెడుతూ కూచుని, "నాకు ఆ డాలర్‌ని ఇవ్వవూ ?"—అని అడిగిన జ్యోతికీ—ఈనాడు, అనురాగంలేని ఎడారి మధ్య ఉండీ కూడా, ఎండిపోవడానికి నిరాకరించి నిలిచి, తన్నూ, తన విద్యనూ, తాను ప్రతినిధిని అనుకునే నాగరికతనూ నిలదీసి ప్రశ్న వేస్తున్న జ్యోతికీ మధ్య ఎంతదూరం ! ఆ క్షణాన తానొక దేవుడయి ఈ పద్దెనిమిదేళ్ల యువతి అడిగిన వరాలన్నీ యిచ్చివేయ గల్గితే ?—ఈ అమాయకురాలి కోమల హృదయం మీదకు రాళ్ళు విసరుతున్న రాక్షసులను చూపుతో భస్మం చేయగల్గితే ?

వాసు ఆమెను చూస్తూనే ఉన్నాడు. కాని గమనించడంలేదు. ఆమె గొంతు విని ఉలిక్కిపడ్డాడు

"వాసూ ! ఆనాడు—అక్కయ్య పెళ్లిలో—అరటిపళ్లున్న గదిలో నేనేడుస్తుంటే నువ్వొచ్చి కళ్లు తుడిచావు. నేను పెద్దవాడినయి నీకు బోలెడు కొనిపెడతా నన్నావు— గుర్తుందా వాసూ ?"

ఎందుకులేదు !

అప్పుడు అతను ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. అమ్మతోబాటు శ్యామల పెళ్లికి—శ్యామల అంటే పిన్నికూతురు కూతురు, అంటే జ్యోతికి అక్కయ్య—ఆ శ్యామల పెళ్లికి తెనాలి వచ్చాడు. ఓ ప్రక్క ముహూర్తం అవుతూంది. ఆ రొదని ఆనందించలేక అలా అలా తిరుగుతున్నాడు తను. ఆ ప్రక్కగదిలోనుంచి ఎవరో ఏడుస్తున్న శబ్దం వినిపిస్తే అటు వెళ్లాడు. ఓమూల కూర్చుని ఏడుస్తుం దొక అమ్మాయి. మధ్య మధ్య మాసిపోయిన పావడాతో ముక్కు తుడుచుకుంటూ వెక్కివెక్కి ఏడుస్తూంది. తను లోపలికి రావడం కూడా గమనించనట్లుంది ఆ గదిలో కొన్ని వందల అరటిపళ్ళు రాసిగా పోసిఉన్నాయి. గంయ్‌మంటూ సన్నటి దోమలు తిరుగుతున్నాయి. వీధిలోకి ఉన్న తూర్పువైపు కిటికీగుండా ఎండ తీక్షణంగా పడుతూంది ఆ అమ్మాయి ఏడుస్తూంది. అయ్యో పాపం అనిపించింది. దగ్గర కెళ్లి పక్కన కూచున్నాడు. ఆ అమ్మాయి ఇటు తిరిగి చూసింది.

"నువ్వెందుకు ఏడుస్తున్నావు ?" అని అడిగా[illegible]

[illegible]మ్మాయి ఏడుపు మానింది, కాని వెక్కిళ్ళు మాత్రం ఉండుండి వస్తున్నాయి.

"ఎందు కేడుస్తున్నావో చెప్పవూ ?"

"నువ్వెవ్వరు ?"—అంది ఆ అమ్మాయి.

"నేను వాసుని ......"

"అంటే నెల్లూరవ్వ అబ్బాయివా ?"

(43వ పేజీ చూడండి)

## వివాహం జూదమా?

(35-వ పేజీ తరువాయి)

ఇంకొక విషయం. భార్యాభర్త లిరువురు తమ తమ అభిప్రాయములను వెలిబుచ్చుటకు ఆచరణలో పెట్టుకొనడానికి, ఒకరి కొకరు కొంత స్వేచ్ఛను ఇచ్చుకోవాలి. భార్యకాని, భర్తకాని, ప్రతి చిన్న విషయంలో జోక్యం కలిగించుకుంటూ ఉంటే ఎంతటి ఓర్పు గలవారికైనా చికాకు కలిగిస్తుంది. ఇద్దరూ ఎప్పుడూ సంతోషంగా ఉండటానికి ప్రయత్నిస్తూ, చిరునవ్వుతో పలకరించుకొంటే తమ కష్టములను మరచిపోతారు. ఇద్దరూ కూడా ఇట్లు ఒకరి సుఖము కొరకు ఒకరు సహకరిస్తూ త్యాగము పరస్పరసానుభూతి, దయ, క్షమ మొదలగు గుణాలు అలవర్చుకొని ఒకరి కొకరు జీవించిననాడు ఆ జీవితం స్వర్గతుల్యమే అవుతుంది. కాబట్టి జూదములో వలె కాక, జీవితమును స్వర్గతుల్యముగా చేసికొనడం మన చేతులలోనే ఉంది. మనం సుఖప్రదంగా చేసుకోవాలంటే జీవితము సుఖముగానే గడిచిపోతుంది. అయితే ఇది ఇద్దరి చేతులలోను ఉంటుంది.

దీనికి ప్రతిగా వివాహానంతరమే ఒకరినొకరు పూర్తిగ అర్థం చేసుకొన గలుగుతారంటే ఒకవేళ ఒకరినొకరు సరిగ అర్థం చేసుకొనకపోయినా, లేక అపార్థము చేసుకొన్నా వారి జీవితములు దుఃఖమయములు అగునని చెప్పవచ్చును. కాని నిజముగా పరస్పరము ప్రేమ కలిగినవారు ఇట్లు అపార్ధము చేసికొను అవకాశము ఉండదు. పైన చెప్పినట్లు స్థూలముగ ముఖ్యమగు విషయములలో ఏకాభిప్రాయము కుదిరి అర్థం చేసుకొన్ననాడు చిన్న చిన్న విషయములలో సర్దుకుపోతూ అర్థము చేసుకొనుట ఒక పెద్ద లెక్కలోనికి రాదు. అది చాలా చిన్న విషయము. ఒకవేళ చిన్న విషయములలో అభిప్రాయ భేదములు వచ్చినప్పుడు ఇద్దరిలో ఏ ఒక్కరుగాని ఓర్పుతో పోయినచో లేక ఒకరికి పట్టుదలగా నున్నప్పుడు మరొకరు సర్దుకుపోయే పద్ధతిని అవలంబించినట్లయితే ఏవిధమయిన చిక్కులు లేకుండ జరిగిపోతుంది.

అట్లా సర్దుకుపోవటం మన చేతిలోనే ఉంది. మన నిశ్చయముపైననే మన జీవిత ఫలితము ఆధారపడి వున్నది. మనము ఆలోచనాపూర్వకముగ ప్రయత్నముచేసి జీవితమును సుఖవంతముగ చేసికొనవచ్చును. కాబట్టి వివాహము కేవలము జూదము వంటిదని అనలేము. ★

---

## వాళ్లు ఇద్దరు

(33-వ పేజీ తరువాయి)

"అవును. మాది నెల్లూరే!"

"ఇక్కడికెందు కొచ్చావ్ ?"

"నువ్వెందు కేడుస్తున్నావ్ ?"

"నేనేడిస్తే నీకేం—"

ఏం జవాబు చెప్పాలో తెలియలేదు తనకు. ఆ అమ్మాయి తనవైపు చూడ్డం మానేసి ఎండలోకి చేతులుజాపి వాటిని చూస్తూ కూచుంది.

"నీకు లడ్లు తెచ్చిపెడతాను. ఏం—నువ్వు ఏడవకూ—" అన్నాడు తను.

ఆ అమ్మాయి తల అడ్డంగా ఊపింది—" నాకు లడ్డేం అక్కర్లేదు .... నువ్వే తిను ! .... నేను ఏడుస్తున్నది అందుకోసం కాదు—"

"మరెందుకు ?"

"అక్కయ్య పెళ్లికి నాకో తెల్ల పట్టు పరికిణ కుట్టించమని అడిగితే మా అవ్వ నన్ను కొట్టింది..... "

తను సలహా యిచ్చాడు—"వెళ్లి మీ అమ్మతో చెప్పరాదూ ?"

"మా అమ్మ లేదు. చచ్చిపోయింది—"

ఎవరయినా అమ్మలేకుండా ఎలా ఉంటారో! తనకు ఆశ్చర్యం వేసింది.

"మానాన్న ఇంకో పెళ్లి చేసుకున్నాట్ట. శ్రీకాకుళంలో ఉన్నాడు."

"ఇప్పు డిక్కడ లేడూ ?"

"ఆయన ఎప్పుడూ ఇక్కడికి రాడుట. మేమంటే ఆయన కిష్టంలేదుట.—అని అవ్వ చెప్పింది."

నాన్నకు ఇష్టంలేకపోవడం అంటే ఏవిటో ? నాన్నకు తనంటే ఎంత ఇష్టమో—తనూ అమ్మా ఈపెళ్లి కొచ్చేస్తుంటే తనకో పెద్ద చాకలెట్ల పొట్లం కొనిపెట్టాడు నాన్న. ఈ అమ్మాయి నాన్న అలా కొనిపెట్టడు కాబోలు—పాపం !

ఆ అమ్మాయి భుజంమీద చెయ్యివేసి చెప్పాడు... "ఇదుగో చూడూ ! నువ్వేమీ భయపడకు ! ఇంకొన్ని రోజుల్లో నేను పెద్దవాడి నయిపోయి పేద్ద ఉద్యోగం చేస్తాను. బోలెడు డబ్బు సంపాదిస్తాను. అప్పుడు నీకేమో బోలెడు పట్టు పరికిణీలు కుట్టిస్తాను— ఏం ?"

ఫక్కుమని నవ్వింది ఆ అమ్మాయి. "—ప్రీ మొహం!" అంది. తనకు కోపం రాబోయింది.

"నువ్వు పెద్దవాడివయి' ఉద్యోగం చేసేప్పటికి నేనింకా పరికిణీలు కట్టుకుంటానేం !" అని మళ్లీ నవ్వింది.

"మరి—?" అప్పుడు తనకు పదకొండేళ్ళు. ఆ అమ్మాయికి తొమ్మిదేళ్లు.

"అప్పుడు చీరలు కట్టుకోవాలి తెలుసా ?"

"పోనీ చీరలే కొందాం—"

ఆమె ఏడుపు పూర్తిగా ఆగిపోయింది. చెంపల మీది చారలు తడి ఆరుతున్నాయి. తన చేత్తో ఆ తడిని తుడిచేస్తూండగా, ఆ చేతిని తీసేసి అంది అమ్మాయి— "నువ్వు మంచివాడివి!"

నెత్తిన ఆకాశం పెట్టినంత పనయింది తనకు.

"మా అమ్మ దగ్గరకు వెళదాం, వస్తావా" అని తాను నిల్చున్నాడు.

తన మెడలో పట్టుదారానికి గుచ్చిఉన్న పతకాన్ని చూసి—"అదేవిటి ?" అంది.

బోలెడు గర్వంతో "ఇది సాయిబాబా డాలరు!" అన్నాడు తను.

"నాకా డాలరు నివ్వవూ ?"

సందిగ్ధంలో పడ్డాడు తను. ఆ డాలరు చాల ఖరీదైనదనీ, అది దగ్గర వుంటే దెయ్యాలూ, జబ్బులూ రావనీ మరీ మరీ చెప్పింది అమ్మ. ఆ డాలరుని అడుగుతూంది ఈ అమ్మాయి. ఇవ్వకపోతే ఏడుస్తుందేమో ?—ఇస్తే అమ్మ ఏమంటుందో—

"పోనీలే—ఇవ్వొద్దులే—" అని మూతి అటు తిప్పుకుంది అమ్మాయి.

"అదికాదులే ..... నేను ఆ డాలర్‌ని నీకిస్తానూ —నువ్వేమో ఎవ్వరికీ చెప్పకూడదు—సరేనా ?"— ఆ డాలర్ ఎక్కడో పడిపోయిందని అమ్మతో చెబుతే సరి—అనుకున్నాడు.

"ఏం ?"

"మా అమ్మా—"

"అయితే వద్దులే—"

"ఫరవాలేదులే—నువ్వు ఈ డాలర్ తీసుకో."

"అయితే ఓపని చేద్దాం ... ఇప్పుడేమో దాన్ని నాకివ్వు .... ఏం .... సాయంత్రందాక నే నుంచుకుని అప్పుడు నీ కిచ్చేస్తాను .... సరేనా .... "

"ఓ!" తను విప్పి ఇస్తే ఆ డాలరుని తన మెళ్లో చెయిన్‌లోకి పిన్నుతో గుచ్చుకుంది. ఆ అమ్మాయి.

ఇద్దరూ కలిసి పెళ్లి పందిట్లోకి వచ్చారు. అప్పుడే ముహూర్తం అయింది.

"అమ్మయ్య .... ఎలాగో ఓలాగు మూడు ముళ్లూ పడ్డాయి—" అంది దూరపుబంధు వొకావిడ.

"అవునమ్మా—ఏదో జరిగిపోయింది ...... అందరూ వద్దంటుంటే అమ్మాయి కావాలని పట్టుబట్టి మరీ చేసుకుందీ అబ్బాయిని—నాలుగు కాలాలబాటు చల్లగా ఉండాలి అంతే" అంది రవణమ్మ.

"ఏమీ—అబ్బాయికేం ?"

"ఏమీ లేదనుకో—! ఆమధ్య కాస్త క్షయ వచ్చి తగ్గిపోయిందని అంటారు—అంతే" అని తాంబూలాలు పంచిపెట్టడానికి లేచివెళ్లింది రవణమ్మ.

ఆపాటికి శ్యామల జీవితం నారాయణకు అంకితం అయిపోయింది.

"రవణమ్మ పిన్నీ ! ఈ అబ్బాయికేం రెండరటి పళ్లివ్వవూ ?" అంటూ ఓ కుర్రవాడిని లాక్కుని వచ్చింది పెళ్లికూతురు చెల్లెలు ......

*   *   *

.... అది ఆరోజు. శాశ్వతంగా ఎవరో తన మనసుమీద చెక్కి వెళ్లిన రోజు. అది గుర్తుందా అని అడుగుతూంది జ్యోతి. ఎంత పిచ్చిపిల్ల ! నిజమే ! ఆ పెళ్లిరోజుకు తొమ్మిదేళ్ల తరువాత ఈనాడు తను జ్యోతి ఎదుట ఉన్నాడు. తనలో— ఆమెలో—ఎన్ని మార్పులు ?

"వాసూ ! నా వయసు ఆడది ఇలా ఒక మగవాడి ఎదుటపడి మాట్లాడదని, మాట్లాడకూడదని, నాకు తెలుసు ...... కాని అమావాస్య రాత్రి వేళ మెరుపుతీగలా నువ్విలా వచ్చావు .... ఇన్నేళ్ళ నా బాధనూ నీ ఎదుట వర్షిస్తున్నాను .... ఏమీ అనుకోకు .... తొమ్మిదేళ్లక్రింద ఆరోజున— నన్నొక మనిషికింద గుర్తించి విలువనిచ్చే వ్యక్తి ఈ ప్రపంచంలో ఒక్క రున్నారన్న ఆశ కల్పించి

## పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదీన్నీ, మీ సరియైన చర్యనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేది, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామా యున్నూ వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైనపంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.



## కుటుంబ నియంత్రణం
### గర్భనిరోధానికి

స్త్రీలు సేవింపదగిన ఔషధము స్పెక్ టేబ్లెట్స్ (రిజిష్టర్డ్) గర్భమురాకుండేందుకు తేలికగా నోటిలో వేసుకొని మింగే మందు 12 రోజులు మందు వాడిన యెడల గర్భధారణ కాకుండా చేయును.

పూర్తికోర్సు పాకెట్టు 24 మాత్రలు వెల రు 12/- వి.పి. అదనము

ప్రతిచోటదొరుకును

ఇండియాలోను, విదేశాలలోను ఈమందువాడినవారు అయాచితంగా అనేక యోగ్యతాపత్రము లను పంపియున్నారు...

SEENU & CO.,
28. K. TANDAVARAYA GRAMANI ST - MADRAS-21.
GRAMS ORCAS. (ESTD 1946), PHONE 35357.
(ADVT. PERMITTED UNDER G.O. MS. NO. 1121 HEALTH.)

డిస్ట్రిబ్యూటర్లు: మెసర్సు దేవి ఏజన్సీస్, మద్రాసు-21.



నూతన పరిశోధనలతో తీర్చిదిద్దబడిన

AHUJA ASE SOUND EQUIPMENTS

## అహూజా యాంప్లిఫయర్లు
లౌడు స్పీకర్లు,
మైక్రోఫోనులు

అందరూ వాడుచున్నారు. గ్యారంటీగా పనిచేయుచున్నవి.

★

డిస్ట్రిబ్యూటర్సు:

## విజయ అండ్ కో., గుంటూరు

బ్రాంచి: సామారంగం చౌక్, విజయవాడ-1.


# వాళ్లు ఇద్దరు

వెళ్లావు నువ్వు .... ఇంతకాలంనుండీ, తెలిసో తెలియకో ఆ ఆశతోనే బతుకుతున్నానంటే నువ్వు నమ్మకపోవచ్చు....కాని అది నిజం .... నువ్వు విశాఖ పట్నంలో అమ్మ నాన్నల దగ్గర పెరిగావు. కాలేజీలో చదివావు. ఉద్యోగం చేస్తున్నావు. అలాటి పరిస్థితులలో నేను నీకు గుర్తుకు వచ్చిఉండక పోవచ్చు.

"అదికాదు జ్యోతీ .... అక్కడకూడా చాలా ఇబ్బందులు ...."

"పోనీ గుర్తుకు వచ్చానే అనుకుందాం .... నీకు ఇక్కడి విషయాలు ఎటూ తెలియవుకదా! మీరేమో ఎవ్వరూ యిటురారు. ఉత్తరాలు రాయరు. నేనా పెళ్లికాని పిల్లను," నీకెలా ఉత్తరాలు రాయగలను చెప్పు—పోనీ రాద్దామనుకున్నా కార్డుముక్క కొకకానీ ఇవ్వగలవాళ్లెవరున్నారు నాకు? .... ఇప్పటికే వాళ్ల ఇష్టం లేకుండా స్కూల్ ఫైనల్‌దాకా చదివానని అమ్మమ్మకూ, సుందరానికీ నామీద కోపం ఉంది.....ఇంకా నీకు ఉత్తరం అంటూ రాస్తే ఇంకేమన్నా ఉందా .... ఆ చదువేదో సక్రమంగా పూర్తి అయివుంటే నా కాళ్ల మీద నేను నిలబడగలిగేదాన్ని .... కానీ నేనే గనక ఆ పరీక్ష పాసయితే నీతీ, జాతీ వదలి విచ్చలవిడి అయిపోతానని ఘోషించేవాడు సుందరం. వాడి కళ్లు చల్లగా ఆ పరీక్ష కాస్తా పోయింది. .... ఇంకేవిటి దారి నాకు ? .... ఒక్కొక్కప్పుడు, అసలుదారి అంటూ ఎందుకు వెతుక్కోవాలి, నేనూ ఒక మనిషినేనా అనిపిస్తుంది. .... నేను ఉండి ఎవరికి సంతోషం. నేను లేక ఎవరికి దుఃఖం. ఏదీలేదు ...."

జ్యోతి ఒక్కొక్కమాటా సమ్మెటపోటులా తగులుతూంది. బాబాయికి అరవై అయిదు దాటింది. పిన్ని ఎంతసేపూ తన గురించేగాని ఇంకొకరి విషయం పట్టించుకోని రాయి మనిషి. ఇహ మిగిలింది—పిన్ని కొడుకు—జ్యోతికి మామయ్య—సుందరం.

"పరీక్షపోతే మళ్లీ కట్టకపోయావా ?"

రాలిపోతున్న పువ్వులాటి నవ్వు నవ్వింది జ్యోతి. "వాసూ! అందుకనే ఇక్కడి పరిస్థితులు నువ్వు నమ్మలేనివని అన్నాను. తాతయ్యకు సరైన ఆదాయం లేదని నీకు తెలుసుగా—సుందరానికి నెలకు డెబ్బైనాలుగు వస్తాయి. దానితో అంతా గడవాలి. అలాంటప్పుడు పరీక్షఫీజు పదిహేను రూపాయలు ఎవరిస్తారు నాకు ?"

"వెధవ పరీక్షఫీజే అయితే—" అని ఏదో అనబోయాడు వాసు.

"నువ్వు కడతానంటావు .... కాని వద్దు వాసూ, వద్దు! నా స్నేహితురాలు ఇందిర అని డాక్టరుగారి అమ్మాయి ఉంది. పోయినసారి పరీక్షకు డబ్బు ఆ అమ్మాయి దగ్గర తీసుకున్నాను... అందుచేత ఇందిర అన్నయ్యకూ నాకూ ఏదో సంబంధం ఉందని అన్నారు ...."

జ్యోతి కళ్లల్లో చల్లటి నిప్పు మండుతూంది. పటపట పళ్లు కొరికింది వాసు మనసు.

"…. నేను చదువుకోవాలి …. నేను ఉద్యోగం చెయ్యాలి …. నేను ఇంకొక్కరికి భారంగా ఉండ కూడదు.—అనుకుంటానే గాని నేను ఎవరికీ ఏ కీడూ తలచనే—అలాటప్పుడు అందరూ కలిసి నన్నిలా ఎందుకు పరీక్షించాలో అర్థంకావడంలేదు. వాసూ ! …. అమ్మ అంటూ ఉంటే ఆమె ఒడిలో ఒక్క నిముషంసేపు కళ్లు మూసుకుని పడుకునే దాన్ని, కానీ …. అయినా పిచ్చిగాని, అమ్మే ఉంటే నే నిలా ఎందుకుంటానూ ? …."

"జ్యోతీ, నామాట విను …. నాతో వచ్చే సెయ్యి …. మా వూరు వెళ్లిపోదాం …. నేను నీకు చదువు చెబుతాను …. అక్కడే చదువు పూర్తి చేసుకో—ఏం …. తర్వాత ఉద్యోగంలో చేరవచ్చు …. లేకపోతే—"

"లేకపోతే—?" కనుబొమలు ముడిచి అడిగింది జ్యోతి.

"—ఏమీలేదు—ఇప్పు డెందుకులే ఆమాట—అన్నట్టు, జ్యోతీ ! ఈ ఊళ్లోనే మీ అక్కయ్యా, బావా ఉన్నారుకద ?"

"అక్కయ్య ! …. అవును …. అక్కయ్య ఉంది. కాని ఆమెకు నేనంటే పడదు వాసూ !"

"కారణం ?"

"ఎటూ నువ్వు ఆమె ఇంటికి వెళ్తావుగా—అప్పుడు తెలుస్తుంది కారణం!" అని ఒక్క క్షణం ఆగి పలికింది జ్యోతి— "కాని ఒక్కమాట వాసూ—అక్కయ్య కూడా అందరిలాగే మాట్లాడుతుంది. అది నా దురదృష్టం. ఆమె మాటలలో నిజం ఎక్కువ వుందని నీ కనిపిస్తుందేమో, కాని—నేను మాత్రం ఆ విషయంమీద ఎవరికీ ఏమీ చెప్పలేను—చెప్పలేను వాసూ !" అని గభుక్కున లేచి వెళ్లిపోయింది జ్యోతి.

ఆశ్చర్యపడ్డాడు వాసు. అతడికేమీ బోధపడడం లేదు. రెండేళ్లక్రింద ఒకనాడు అత డక్కడ ఉంటే—తెలిసి ఉండేది.

ఆనాడు—

జ్యోతి ఇంట్లో పనిచేసుకుంటూంది. సాయంకాలం ఆరింటికే బాగా చీకటయింది. జ్యోతి ఆకాశము వైపు చూసింది. 'వర్షం కురుస్తుందేమో' దొడ్లోకి వెళ్లి ఉతికి ఆరవేసిన బట్టల్ని భుజం మీదకు వేసుకుంది. ఇంతలో వీధివైపు అలికిడి అయింది పరుగెత్తుకొచ్చింది జ్యోతి.

నారాయణ వచ్చాడు. చొక్కా విప్పుతున్నాడు. చినుకులు పడసాగాయి. జ్యోతి లోపలికి వెళ్లబోయింది.

"జ్యోతీ !"

ఆగి వెనక్కు తిరిగిచూచింది.

"అక్కయ్యేదీ ?"

"ఇంకా ట్యూషన్ నుండి రాలేదు బావా ?"

నారాయణ నవ్వాడు. "అవున్లే, ఎందుకొస్తుందీ ?"

చెంపమీద కొట్టినట్లయింది జ్యోతికి—'ఏమిటి బావా నువ్వంటున్నదీ ?"

"ఆ …. ఏముందిలే గానీ …. అమ్మాయేదీ ?"

"లలిత అమ్మమ్మ ఇంటికి వెళ్లింది బావా …. సుందరం వచ్చి తీసుకువెళ్లాడు. రాత్రికి అక్కడే ఉంటుందిట—" అనేసి వంటింట్లోకి వెళ్లింది. వర్షం ఎక్కువయింది. అన్నం దింపేసి ముందు గదిలోకి వచ్చింది.

నారాయణ పచార్లు చేస్తున్నాడు. మధ్య మధ్య దగ్గుతున్నాడు. జ్యోతిలాంతర్లు తుడవసాగింది.

"బావా ఆస్పత్రికి వెళ్లి ఏదయినా మందు తీసుకోరాదూ ?"

నారాయణ వచ్చి జ్యోతి ఎదుట నిల్చున్నాడు. రెండో లాంతరు చిమ్నీని తీసుకుంది జ్యోతి.

"నాకెందుకు జ్యోతీ, ఆస్పత్రులూ మందులూ ?"

"నీకు కాస్త బలం వస్తే ఎక్కడయినా చేరవచ్చు కదా ?"

"ఓహో …. ఇప్పుడు మీ అక్కయ్య కష్టపడిపోతూందేనని బాధన్నమాట !"

"అదికాదు బావా ! ఏమీ పనిలేకుండా రోజంతా ఇంట్లో కూచోవాలంటే మగవాడికి కష్టం కాదూ ?'

లాంతర్లలో కిరసనాయిలు పోసింది జ్యోతి. ఇంటా బయటా చీకటి పెరుగుతూంది. వర్షం ముదురుతూంది. నారాయణ వచ్చి కూచున్నాడు.

---

తండ్రి :- ఒరేయ్! ఎందుకురా నువ్వు ఇంత చిన్నపని కూడా చెయ్యావు. నువ్వు నిజంగా గాడిదవేరా!

కొడుకు :- అది సరేకాని, పొద్దున్న తాతయ్య నన్ను గాడిదకొడకా అని తిట్టాడు.

కంచర్ల కమలపుల్లేశ్వరరావు,
(అమలాపురం)

---

"జ్యోతీ !—నిజంగా నేనంటే—" సగం వాక్యంలో ఉలిక్కిపడ్డాడు నారాయణ. వీధిలో బిచ్చగాడు అరిచాడు.

జ్యోతి లాంతర్లను వెలిగించింది. ఒకదానిని తీసుకుని లేవబోయింది. హఠాత్తుగా ఆమె చేయిపట్టి లాగాడు నారాయణ.

లాంతర్లమీద పడబోయిన జ్యోతిని లాఘవంగా తన చేతుల్లోకి తీసుకున్నాడు.

నల్లటి మేఘాల మధ్య ఒక మెరుపుతీగ మెలికలు తిరిగింది.

ఒక్క వూపుతో ఇవతలికి వచ్చిపడింది. జ్యోతి.

"బావా ! బా …. వా …. !"

నారాయణ పెదవులమీద చీకటి నవ్వొకటి వెలిగింది.

పెద్దగా ఉరిమింది ఆకాశం.

మళ్లీ జ్యోతి పెనగులాడింది. అతడి చేతులలో.

ఆ క్షణాన్నే—అలసి, తడిసి, ఇంటోకి అడుగు పెట్టింది శ్యామల.

జ్యోతి చచ్చి మొత్తుకున్నా ఒప్పుకోలేదు. "నేను ఏది కోరుకున్న నా మొగు డెన్నటికీ అలా ప్రవర్తించడు. నువ్వే ద్రోహివి …. నా సంసారాన్ని పాడుచెయ్యక వెళ్లిపో—నువ్వు నా చెల్లివి కాదు—" అంది శ్యామల.

ఆ రాత్రే—ఆ చీకట్లోనే— ఆ వర్షంలోనే మళ్లీ దారిద్ర్యంలోకి—అమ్మమ్మ దగ్గరకు వచ్చింది జ్యోతి.

మళ్ళీ చెఱిసాలలోకి, సుందరంవున్న ఇంట్లోకి వచ్చింది జ్యోతి. అది రెండేళ్ళ కింద. ఆనాడు.

ఈనాడు ఇవన్నీ నోటి మాటలతో చెప్పలేక లేచివెళ్లింది జ్యోతి. ఇవన్నీ తెలియక కొట్టుకులాడాడు వాసు. అంతకంతకూ అల్లుకుపోతున్న ఈ అగాధాన్ని కనుక్కోవా లనుకున్నాడు.

సాయంకాలం — టిఫినయిం తర్వాత — రామలింగేశ్వరప్పేట వైపు నడిచాడు. మేష్టరమ్మ ఇంటి గురించి వాకబు చేశాడు.

"అదిగో …. ఆ పసుపు మేడ తర్వాత, లాంతరు స్తంభం ఉంది చూశారా—దాన్ని ఆనుకునివున్న పెంకుటిల్లేనండి—" అన్నాడు ఆ సందు మొగదల కిళ్లీకొట్టువాడు.

"ఏదీ—ఆ నీలిరంగు కిటికీలున్నదేనా ?"

"మరేనండి …. ఇదిగో …. అమ్మగారే వస్తున్నట్టున్నారు—"

తెల్లటి చీరలో సన్నగా పొడుగ్గా ఉంది శ్యామల. చేతిలో పుస్తకాలూ, గొడుగూ ఉన్నాయి. మనిషి ఎక్కువ మారలేదు. ఆ కుడి బుగ్గమీది మచ్చ అలాగే ఉంది. ఎదురు నడిచాడు వాసు.

తననే చూస్తూ వస్తున్న వ్యక్తిని గుర్తించడానికి అర నిముషం తీసుకుంది శ్యామల.

"ఎప్పుడొచ్చావోయి వాసూ ? ఓ వారం అయి ఉంటుందా—?"

వాసు నవ్వాడు—"లేదు శ్యామూ ! పొద్దుటే వచ్చాను—"

"అవున్లేవోయ్ ! అంతపెద్ద పిన్నిగా రుండగా మా ఇంటి కెందు కొస్తావులే ?"

వాసు పలకలేదు.

"అమ్మా నాన్నా బాగున్నారటోయ్ ?….కళ్లజోడు ఎప్పణ్ణించేవిటి ?…బాగా పొడుగయ్యావే! ….పెళ్లయిపోయిందా ?—"శ్యామల టపటపమని అడిగింది. ఏవో సమాధానాలిచ్చాడు వాసు. ఇల్లు చేరారు. కుర్చీలో కూర్చోమంది.

"ఏయ్—లలితా ! భాస్కర్ ! ఇటు రండర్రా—మా విశాఖపట్నం మామయ్యని చూడండి—" అని కేకేసింది శ్యామల. ఇద్దరు పిల్లలు వచ్చారు. లలిత జుత్తు శ్యామల లాగే కాస్త రాగి రంగు. భాస్కర్ లలితకన్న తెల్లగా ఉన్నాడు.

"ఈ ఇద్దరూ మా రత్నాలోయ్—ఇదేమో ఒకటో తరగతి చదువుతూంది. వీడికి రెండో ఏడు నిండబోతున్నది. ఏం, అదీ ఇక్కడి వార్తలు. ఇహ నీ విశేషాలు చెప్పు బాబూ !"

తన్ను చూసి ఉప్పొంగిపోతుంది శ్యామల. తానెప్పుడూ ఈవిడకు ఉత్తరమయినా రాయలేదు. హఠాత్తుగా వినపడింది ఆమె కంఠం.

"నువ్వు కళ్లజోడులో ఎంతో బాగున్నావు తెలుసా ?" అని నవ్వింది శ్యామల. తల వంచుకున్నాడు వాసు. పిల్లలిద్దరూ ఆడుకోవడానికని వెళ్లిపోయారు.

ఓరలెక్స్
సర్వ చర్మ రోగ నివారిణి
ఓరలెక్స్ టూత్ పౌడర్
ప్రతివారి నిత్య వాడుకకు
ఓరలెక్స్ లేబరేటరీస్,
కాకినాడ

ఉత్తమ గ్రంథాలు

పథేర్ పాంచాలి—విభూతిభూషణబెనర్జీ 7-50
జీవనలీల—మానిక్‌లాల్ బంధ్యోపాధ్యాయ 6-00
పల్లెజీవులు — ,, 2-50
అంతర్ద్వేషాలు — వన పూల్ 2-75
నిశాగీతి — 'షెవడే' 3-50
దేవతలయుద్ధం—విశ్వనాథ సత్యనారాయణ 1-50
సంసార సుఖం — టాల్‌స్టాయ్ 2-50
పవకథామంజరి — ప్రసిద్ధ రచయితలు 1-25
20 రూ.లు పంపితే అన్నీ పంపబడును.
విశ్వవాణి పబ్లిషర్సు, విజయవాడ-2.

యువతీ యువకులకు
మంచి పుస్తకాలు

పగడాలు— ఆచంట శారదాదేవి 2-50
సంధ్యారాగం— వింజమూరి లక్ష్మి 1-50
తొణికిన స్వర్గం— కే. రామలక్ష్మి 2-00
పంకజం— రమాదేవి 1-25
మనం—మన సంసారాలు— ,, 1-50
తల్లి, బిడ్డ— దరిశి సుభద్రమ్మ 1-50
రాగజలధి— 'లత' 3-00
వరలక్ష్మి— పి. వి. కృష్ణమూర్తి 2-00
వైకుంఠపాళి— ,, 1-50
నాగరిక— 'సత్య' 1-50
ఇదా నాగరికత?— రాం గోపాలరాఘవ 1-25
సహచరులు— రాజేంద్ర 1-50
వరుడు— అడివి బాపిరాజు 2-50
జాజిమల్లి— ,, 2-50
దగాపడిన తమ్ముడు—బలివాడ
కాంతారావు 5-00
పెద్ద పెద్ద కళ్లు—ఉపేంద్రనాథఅష్క్— 4-00
దత్తపుత్రుడు—డా॥ పి. రామమూర్తి 5-00
ప్రతాప రుద్రమదేవి—కొల్లకూరి
నారాయణరావు 7-50
మనుషులు—మనసులు— కె. వి.
గోవిందరావు 1-50
గుడిగంటలు— ఎల్లోరా 1-00
రు. 50ల 20 పుస్తకాలు రు.40 లకే అడ్వాన్సు
పంపినవారికి ఖర్చులు భరించి పంపుతాము.
ఆదర్శ గ్రంథమండలి. విజయవాడ-2.

# వాళ్లు ఇద్దరు

"అంత సిగ్గుపడతా వెందుకోయ్—నా పెళ్లికి నువ్వెంతవాడివో తెలుసా ?—ఇంతవాడివి !" అని నేలకు మూడడుగుల ఎత్తున ఒక చేతిని వుంచి ఇంకో చేత్తో నెత్తిమీద మొట్టింది.

ఎంత తమాషా మనిషి ! మనిషంత తెల్లటి నవ్వు. నవ్వంత వెలుగుతున్న కళ్లు ! గోడవైపు చూస్తున్నాడు వాసు. శ్యామల నారాయణ పిల్లలు కలిసి తీయించుకున్న ఫోటో కంటబడింది.

"ఈపూట నీ భోజనం యిక్కడే !" అంది శ్యామల వంటింట్లోకి నడుస్తూ.

"ఊహు—అదికాదు శ్యామూ !" అన్నాడు తానూ ఆమె వెంట వెడుతూ—.

"అదేమీ వీల్లేదబ్బాయ్—కావాలంటే మీ పిన్నిగారింటికి కబురు పంపిస్తాను—"

పీట వేసింది. చతికిలబడ్డాడు వాసు.

"ఈపూట వంటేమిటో చెప్పనుటోయ్ !" టొమాటోల పెరుగు పచ్చడి—అరటికాయ ఆవపెట్టి కూర—పప్పుచారు—"

ఆశ్చర్యంగా చూశాడు వాసు.

"నాకు తెలుసులేవోయ్—నీకు నచ్చిన వేమిటో ! 'నారాయణ ఎంత అదృష్టవంతుడో' అనుకున్నాడు వాసు, అడిగాడు— "నారాయణ ఆరోగ్యం ఎలా ఉంది ?"

అంతవన్నెలనూ ఒకమబ్బు మూసేసింది. అదొక్క క్షణం మాత్రమే !

"అదేనోయ్—ఆస్పత్రిలో చేర్పించి రెండు నెలలయింది. ఏదో అలా నెట్టుకొస్తున్నారు—డాక్టర్లేమో మామూలే. చెయ్యగల్గిందల్లా చేస్తున్నామంటారు. ఎక్స్‌రేల కేమీ కొదవలేదు. ఒక్క 'లంగ్' సగానికి పైగా దెబ్బతిన్నదట. కోలుకోవడానికి కనీసం అయిదారు నెలలయినా కావాలిట—మదనపల్లి వెళ్లమంటారు—"

"మరి వెళ్లకూడదూ ?"

"నాకి ట్యూషన్లమీద వచ్చేదంతా అరవై రూపాయలు ! అందులో ఇంటి అద్దె పది రూపాయలు పోతే—"

"మీ ఆయనకు కొంత భూమి ఉండాలేమో ?"

"అయ్యోరామ ! మావారి తమ్ముడొక శ్రేయోభిలాషరా వున్నాడులే—ఈ సమయం జూసి అమ్ముకు తింటున్నాడు—"

తల వంచుకున్నాడు వాసు.

"అది సరేగాని వాసూ ! అప్పడాలని నిప్పుమీద కాల్చనా, నూనెలో తేల్చనా—ఏది యిష్టం నీకూ ?" అంది శ్యామల .........

భోజనం అయింది.

రాత్రి అక్కడే పడుకున్నాడు వాసు. అతడి ప్రక్కన లలిత, భాస్కర్, పిల్లల కవతల శ్యామల పడుకున్నారు. ఏవేవో మాట్లాడించింది శ్యామల. నెమ్మదిగా నిద్ర వచ్చేసింది వాసుకు.

ఎప్పుడో రాత్రి—మెలకువ వచ్చింది. వాసు లేచి కళ్లు తుడుచుకున్నాడు. గోడమీద గుడ్డిదీపం మసకగా వెలుతురు చల్లుతూంది. మంచినీళ్లు కావాలి—శ్యామల పడకమీద లేదు.

వెక్కిళ్ల శబ్దం వినిపిస్తే ఉలిక్కిపడ్డాడు వాసు. లేచి వంటింటి ప్రక్కగా ఉన్న గుమ్మం దాటి దొడ్లోకి వెళ్లాడు.

అక్కడ—ఆకాశం కింద — నక్షత్రాల వెలుతురులో—గోడ నానుకుని కూర్చుంది. చేతులలో మొహాన్ని దాచుకుని ఉంది. ఉండుండి త్రుళ్లి పడుతూంది శ్యామల.

వెళ్లి ఆమె కళ్లనీళ్లు తుడుద్దా మనుకున్నాడు. తనచేతుల్లోకి తీసుకుని లాలిద్దామనుకున్నాడు. ఆమె ఏం చెయ్యమంటే అది చేద్దా మనుకున్నాడు.

కాని, ఏం చెయ్యలేదు వాసు. మంచినీళ్ల విషయం కూడా మరిచిపోయి వెనక్కొచ్చి పడుకున్నాడు. చాలసేపు వరకు నిద్ర రాలేదు.

రాత్రి శ్యామల ఎప్పుడు వచ్చిందో ఏమో—

పొద్దున్నే వాసు చెవిలో చన్నీళ్లు పోసింది. ఉలిక్కిపడి లేచి కూచున్నాడు వాసు.

"ఏమిటయ్యా వాసూ! నీ వ్యవహారమంతా చెడ్డ బాలుడు—సోములా ఉందే—! మా పిల్లలు చూడూ ఎంచక్కా మొహాలు కడిగేసుకుని, కాఫీ తాగేసి కూచున్నారో !!"

వాసు ఏమీ మాట్లాడలేకపొయ్యాడు. అప్పటికే స్నానంచేసివుంది శ్యామల. జుత్తుని వదులుగా ముడివేసుకుని ఉంది. గుండ్రటి కుంకుమ బొట్టు నొసట తీర్చిఉంది.

"ఏమి పలకవేం మామయ్యా ! కాబోయే మా అత్తగారు కన్పించా రేమిటి కలలో—" అంది శ్యామల నవ్వుతూ.

"లేదు! కోడలే కన్పించింది—" అన్నాడు వాసు.

భ్రుకుటి ముడిచింది శ్యామల—" ఏమిటీ ! కోడలు కన్పించిందా— అయ్యో పాపం ! అదేమంత ఆరోగ్యవంతమయిన కల కాదులే ! .... మహాశయా ! ఇహ ఈ వూకదంపుడు మానేసి లేచి వస్తే 'ఏ' క్లాస్ కాఫీ ఇస్తాను .... ఏం .... పది నిముషాల్లో రావాలి .... పదో నిముషం రాకపోతే—నీకూ కాఫీకీ బెబ్బే—" అని వంటింట్లోకి పరుగెత్తింది శ్యామల.

వాసు లేచి మొహం కడుక్కున్నాడు. కాఫీ తాగాడు. స్నానం చేశాడు. తొమ్మిదింటికి పిల్లలకూ తనకూ భోజనం పెట్టి, తాను భోంచేసి పిల్లల్ని తీసుకుని బడికి బయలుదేరింది శ్యామల.

దారి పొడుగునా, ఏవిటి మరిచిపొయ్యానా అని మధనపడ్డాడు వాసు. పిన్ని ఇంటి గుమ్మంలో అడుగు పెడుతుండగా, పెరుగు పోయించుకుంటున్న జ్యోతి కనపడింది. ఒక్కసారి తలెత్తి చూసి లోపలికి వెళ్లిపోయింది.

జ్యోతి—శ్యామల—

గులాబి—కస్తూరి !

ముళ్లమధ్య నలిగిపోతూ నాకోంతో వెలిగేది ఒకటి.

దాచినా దాగక, తొక్కినా అణగక ఉండేది రెండోది.

—ఇంతకూ తను జ్యోతిని గురించి శ్యామల నుండి తెలుసుకున్న దేవిటి ?—ఏమీలేదు ! తన అసమర్థతకు తానే నవ్వుకున్నాడు వాసు.

ఆ సాయంకాలం తాను బాబాయితో పార్కుకు వెళ్ళాడు. ఆ మాటా ఈ మాటా వచ్చి జ్యోతి ప్రసక్తి వచ్చింది.

"జ్యోతిని ఏం చెయ్య దలుచుకున్నారు బాబాయ్ ?"

"ఇందులో తలచుకోవడానికి ఏం ఉందోయ్—కొస్త వీలు చూసుకుని సుందరంచేత ఆ మూడు ముళ్ళూ వేయించడమే—"

మిన్ను విరిగి నెత్తిమీద పడ్డట్లు కాగా, గుండె దడతో అడిగాడు వాసు— "సుందరాన్ని చేసుకోవడం జ్యోతి కిష్టమేనా—?"

"జ్యోతిని చేసుకోవడం సుందరాని కిష్టమేనోయ్—" అని నడుస్తున్న వాడల్లా బాబాయి ఆగిపోయాడు. ఊతకర్రమీద రెండు చేతుల్నీ ఆనించి వాసుకేసి చూశాడు. ఆయన నుదుటిమీది ముడతలు వాసు తొందరని చూసి నవ్వాయి— "వాసూ—నాకీ ఒక్కపూట అన్నం పెడుతున్నది ఎవరో తెలుసా ?—సుందరం ! వాడిని కాదని ఏదీ చెయ్యలేను. తెలిసిందా—అంతేకాదు—ఇంకోడి కిచ్చి చెయ్యాలన్నా మూడు వేలూ, నాలుగు వేలూ పెట్టగలవా డెవ్వడు ? .... కనుకా—"

ఆశల నైవేద్యమన్నా, బ్రతుకుల బానిసత్వమన్నా డబ్బుకి మహా యిష్టం. ఎంత .... !! వాసు ఆపాదమస్తకం సూదులతో పొడిచినట్లయింది.

వాసు, బాబాయితో ఇల్లు చేరుకున్నాడు. కాళ్ళు కడుక్కుని భోజనానికి కూచున్నాడు. సుందరమూ కూచున్నాడు. పిన్ని వడ్డించింది! ఆశ్చర్యం వేసింది వాసుకు

భోజనాలయాయి. నిముష నిముషానికీ ఏదో వరద పెల్లుబికిపోతూంది వాసులో.

పడుకోబోతూ అడిగాడు : "సుందరం ! జ్యోతి ఏదీ ?"

"జ్యోతా ? ఈ ప్రక్క ఊళ్ళో వాళ్ళ దూరపు బంధువులున్నారులే — వా ళ్ళివాళ సాయంకాలం వచ్చారు. జ్యోతిని నాల్రోజు లుంచుకుని పంపుతామని తీసుకు వెళ్ళారోయ్—"

విపరీతమయిన కోపం వచ్చింది వాసుకు.

"అయితే జ్యోతి రేపు రాదా ?" అని అడిగాడు. సుందరం ఒక్క చూపు చూసి వెళ్ళిపోయాడు.

ఎవరో పట్టపగలే తన్ను దోచుకున్నట్లయింది వాసుకు. బాబాయినీ పిన్నినీ ఎడా పెడా తిడదామనిపించింది. సుందరం పీక పిసికేద్దామనిపించింది.

కానీ అవేమీ చెయ్యక, సరిగా నిద్రపోక, పొద్దున్నే లేచి స్టేషన్ చేరుకున్నాడు వాసు.

వచ్చిన వారం తర్వాత తెగించి జ్యోతి కొక ఉత్తరం వ్రాశాడు. మూడో రోజు అది నాలుగు ముద్రలతో తిరిగి తనకే వచ్చింది. తెనాలి వెళదామనుకున్నాడు. కాని వీలుపడలేదు. ఇంతలో ఉద్యోగ రీత్యా జబల్‌పూర్‌లో ట్రెయినింగ్‌కు వెళ్ళాల్సి వచ్చింది. వెళ్ళాడు.

క్రొత్తచోటు—క్రొత్త స్నేహితులు — క్రొత్త విషయాలు—వాసు కాలానికి రెక్కలు వచ్చాయి. అయిదు నెలలు ఎగిరిపోయాయి.

ఒక ఆదివారం—

వాసు మరో మిత్రుడితో కలిసి హాయిగా టిఫిన్ ఆరగించాడు. సినిమాకు వెళ్ళాడు. మెస్‌కు వచ్చి భోంచేశాడు. రిక్షామీద గది చేరుకున్నాడు. మధ్యాహ్నం ఒంటిగంటయింది. గది తలుపు తీశాడు. ఒక కార్డు పడివుంది.

'చి. వాసుకు—జ్యోతి రెండు వారాలబాటు విష జ్వరంతో బాధపడి మొన్న బుధవారం రాత్రి కన్ను మూసింది—బాబాయి—'

భర్త:-ఏమేవ్ రాత్రి సినిమా ఎలా వుందే?

భార్య- (భర్త పక్కన కూర్చుంటూ :) ఇలాగుందండి.

భర్త:-అబ్బా!ఇదేమిటే ఈలా గిల్లావ్.

భార్య:-రాత్రి సినిమాహాల్లో నల్లులు అలా కుట్టాయండి.

ఎన్. సుబ్బారాయుడు (శృంగవృక్షం)

"ఏమండీ వాసుగారూ ! ఇందాక మీకోసం ఓ ఎక్స్‌ప్రెస్ కార్డు వచ్చింది. నేను సంతకంచేసి తీసుకున్నాను. మీ గదిలో పడేశాను—చూశారా?" అంటూ వచ్చాడు ప్రక్కగదిలోని సూర్యనారాయణ.

* * *

రెండేళ్ల తర్వాత—

విశాఖపట్నం .... సముద్రతీరం.

నీటికి కాస్త దూరంగా కూచుని ఉన్నాడు వాసు. చెదిరిపోతున్న జుత్తుని ఒక చేత్తో సద్దుకుంటూ ఇంకో చేత్తో ఇసుకలో గీతలు గీస్తూ చెబుతూంది శ్యామల.

".... వాసూ! అదీ ఆ అభాగ్యురాలి కథ .... నేను ఆయన్ని ఏరి కోరి వరించాను. కష్టమో, సుఖమో పడ్డాను. కానీ జ్యోతి జీవితంలో కృష్ణపక్షం మాత్రమే చవిచూసి వెళ్ళిపోయింది .... ఆ అమాయకురాలి బ్రతుకుని అంత దుర్భరంగా చేసిన వాళ్ళల్లో నే నొక్కతెను—అన్న యధార్థం స్ఫురణకు వచ్చినప్పుడెల్లా చచ్చిపోదా మనిపిస్తుంది. కాని నాకు యిద్దరు పిల్లలున్నారు—" అని తలెత్తి చూసింది. వాసు దృష్టి దూరంగా వెళ్తున్న నౌకమీద ఉంది. సముద్రం సంతోషంతో పొంగి పొంగిపోతూంది.

".... వాసూ ! మదనపల్లిలో ఆఖరురోజున నా ఒడిలో పడుకుని నిజం చెప్పేదాకా ఆయన మాట నమ్మాను .... అంతవరకూ ఆయన మాటను నమ్మేయడం తప్ప మరోటి తెలియదు నాకు .... ఆయన మాట నమ్మాను. నా తోడబుట్టిన దానిని అనుమానించి అవమానించాను. దూరం చేసుకున్నాను ..... "

"అయితే, జ్యోతి కంతగా జ్వరం వస్తే ఆస్పత్రిలో చేర్పించలేదా శ్యామూ ?"

"జ్యోతి చావలేదు వాసూ !"

జబల్‌పూర్‌లో ఆ కార్డు చదివినప్పటినుండి జీవితంలో ఎన్నో వాటికి ఆశ్చర్యపడ్డం మానేసిన వాసు కూడా చలించాడు.

"సుందరంతో పెళ్ళి కిష్టపడని జ్యోతి ముహూర్తపు ముందురోజు చచ్చిపోయింది వాసూ!"

హోరుమంటూ వచ్చిందొక పెద్ద కెరటం. వాళ్ళిద్దరి పాదాలనూ తడిపి వెళ్ళిపోయింది. ఐస్ క్రీం కుర్రవాడు అరుస్తూ వెళ్ళాడు. ఇద్దరు పిల్లలు గాలిపటా లెగరవేసుకుంటూ పరుగెత్తారు.

"లలితా, భాస్కరూ ఎక్కడున్నారు శ్యామూ!"

"వాళ్ళిద్దరినీ ఒక సదనంలో చేర్పించానోయ్."

"మరి నువ్వేం చెయ్యదలుచుకున్నావూ ?"

"నేను తలచుకోవడ మేమిటీ ? నా ఉద్యోగం ఉందిగా—"

"అదికాదు నే నన్నది—"

"ఓహో అదా—" ఫుల్లుమంది శ్యామల. నుదుట బొట్టు ఉంటే ఇంకా ఎంత అందంగా ఉండేదో—అనుకున్నాడు వాసు.

"నేను మళ్ళీ పెళ్ళి చేసుకో దలచుకున్నానోయ్—"

విస్తుపోయాడు వాసు.

"ఏం—అలా కళ్ళప్పగించి చూస్తావేం ?—నేను ముసలిదాన్నయి పోయాననా ?"

ఇసకతో ఆడుకుంటున్న ఆమె చేతి వ్రేళ్ళను తీసుకున్నాడు వాసు— "కాదు శ్యామూ, కాదు ... నువ్వు తప్పక పెళ్ళి చేసుకో !"

"ఊ .... ఇంతవరకూ పెళ్ళి చేసుకోకుండా ఉంటే నిన్నే వరించేదాన్ని కదుటోయ్—" అని వాసు చేతిని విసిరేసి లేచి నిల్చుంది శ్యామల.

"శ్యామూ ! నీ కో కొత్తపేరు పెట్టనా ?"

"ఏమిటదీ ?"

"ఉష."

నవ్వి, ముందుకు నడిచింది ఆమె.

అతడు అనుసరించాడు .....

సూర్యుడు చల్లగా దగ్గరకొస్తే ఆకాశం ఎర్రగా సిగ్గుపడింది. ★